క్లుప్తంగా

పాఠశాలల్లో సౌకర్యాల పరిశీలన



హరిపురం పాఠశాలలో జిల్లాస్థాయి బృందం

ఓదెల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను జిల్లాస్థాయి బృందం సభ్యులు ఎండీ అమ్జద్, ప్రవీణ్, సంపత్‌రెడ్డి, దేవేందర్, ప్రభాకర్, రవి గురువారం పరిశీలించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను వారు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనం అందించాలని సూచించారు. పాఠశాలలో జరిగే ఫండమెంటల్ లిటరసీ, పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఆన్‌గోయింగ్ ఆక్టివిటీస్ చెక్ చేశారు. ఎంఈవో ఎర్ర రమేశ్, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు పద్మ, సాంబయ్య, సీఆర్పీలు ఓంకార్, రాజేందర్, తిరుపతి పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణం కూల్చివేత

పెద్దపల్లిరూరల్: పట్టణంలో మార్వాడీ సమాజ్ వారు నిర్మిస్తున్న శ్రీరామ, దాసాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. ఆలయ ప్రహరీని కొంత భాగం వెనక్కి జరపాలంటూ సూచించారు. అయితే ఇదివరకు ఆలయం ఉన్న రీతినే నిర్మాణం చేపట్టామని ఆలయ నిర్మాణకర్త నారయణదాస్ తివారీ తెలిపారు. మున్సిపల్ అధికారులు జేసీబీతో ప్రహరీ నిర్మాణం కోసం చేపట్టిన పనులను కూల్చివేసేందుకు రాగా ఎన్‌డీ తివారీ, సరళ తివారీతో పలువురు నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో పోలీసు పహారా నడుమ నిర్మాణ పనులు కూల్చివేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకే ఇదివరకు ఉన్న రీతినే పనులు చేపట్టామని తివారీ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే, ఎంపీలతో పాటు మున్సిపల్ కమిషనర్‌కు వివరించానని, సానుకూలంగా స్పందించి ఇప్పుడు భక్తులకు ఇబ్బంది కలిగేలా నిర్ణయం తీసుకున్నారని వాపోయారు.

ఆడపిల్లలపై వివక్ష చూపొద్దు

ఓదెల: ఆడపిల్లలపై వివక్ష చూపొద్దని, బాల్య వివాహాలను అరికట్టాలని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. ఓదెల కస్తూరిబా బాలికల పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ, పిల్లల హక్కులు, చట్టాలు, మహిళల హక్కులు, బేటీ బచావో–బేటీ పఢావో గురించి వివరించారు. పని ప్రదేశాల్లో మహిళలపై జరగుతున్న దాడులకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుశీల, ఉపాధ్యాయులు సుమలత, సునీత, కావ్య, అనుశ్రీ, బాలల పరిరక్షణ కమిటీ సభ్యురాలు వంగల శ్యామల, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ బి.శ్యామల పాల్గొన్నారు.

మరణించిన వారిపై విమర్శలు మానుకోవాలి

సుల్తానాబాద్: మరణించిన గద్దర్‌పై విమర్శలు చేయడం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మానుకోవాలని సివిల్ సప్లై మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్లలో మొదటి పేజీలో రావడానికి బండిసంజయ్ తాపత్రయపడి విమర్శలు చేస్తున్నారన్నారు. గద్దర్ మరణించిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనను ప్రశంసిస్తూ వారి కుటుంబ సభ్యులకు లేఖ రాశారని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొనడమే కాకుండా ప్రజలను చైతన్యవంతం చేయడంలో క్రియాశీల పాత్ర గద్దర్ పోషించారని ఆయన కొనియాడారు. వెంటనే ఆయన అన్న మాటలు వెనక్కి తీసుకొని వారి కుటుంబానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

7న హైదరాబాద్‌కు కదలిరండి



ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంథని: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డప్పులు.. వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. మంథని మండలంలోని ఆరెంద, మల్లారం, వెంకటాపూర్, భట్టుపల్లి, ఖాన్‌సాయిపేట్, అడవిసోమన్‌పల్లి గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మంథని చందు, జిల్లా అధికార ప్రతినిధి పొట్ల రమేశ్, ఎస్సీ సెల్ మంథని డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కపాక సంపత్, బూడిద శంకర్, బూడిద తిరుపతి, మంథని లింగయ్య, గాడెపు బానేష్, ఆరెపల్లి నాగరాజు, కాసిపేట సాంబయ్య ఉన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందేనా?

- వరదలకు తెగిన ఆర్‌ఎస్‌బీ కెనాల్ గట్టు
- చెట్లపొదలతో నిండిపోయిన కాలువ
- శిథిలావస్థలో కల్వర్టు



చెట్లపొదలతో నిండిపోయిన ఆర్‌ఎస్‌బీ కెనాల్



రాజాపూర్ శివారులో తెగిపోయిన కెనాల్ గట్టు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రిజర్వాయర్ నుంచి మంథని నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సాగు నీరు అందించే ఆర్‌ఎస్‌బీ కాలువ వరదలకు కెనాల్ గట్టు తెగిపోయింది. కాగా పూడిక, చెట్లపొదలతో నిండిపోయి చివరి ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితులు నెలకొన్నాయి. పూడిక, మరమ్మతుకు నిధులు మంజూరు చేస్తామని ఇటీవల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పేర్కొన్నారు.

35వేల ఎకరాలకు సాగునీరు..

గుండారం రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించే ఆర్‌ఎస్‌బీ కెనాల్ పరిధిలోని కమాన్‌పూర్, రామగిరి, మంథని, ముత్తారం మండలాల పరిధిలో సుమారు 35వేల ఎకరాలకు పైబడి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం కాలువ చెట్లపొదలతో నిండిపోవడంతో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందని పరిస్థితులు నెలకొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధిహామీలో చేపట్టని పనులు..

ఆర్‌ఎస్‌బీ కాలువలోని పూడిక, చెట్లపొదల తొలగింపు పనులు గతంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టారు. ఈ ఏడాది ఉపాధిహామీ పథకంలో పూడిక, చెట్లపొదల తొలగింపు చేపట్టలేదు.

కోతకు గురైన కెనాల్ గట్టు

ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు సమీపంలోని గుట్ట నుంచి వచ్చిన వరదకు రాజాపూర్ శివారులో కాలువ గట్టు కోతకు గురైంది. సంబంధిత అధికారులు పరిశీలించారు గానీ ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టలేదు.

శిథిలావస్థలో కల్వర్టు..

గుండారం రిజర్వాయర్ నుంచి సాగునీరు సరఫరా జరిగే ఆర్‌ఎస్‌బీ కాలువపై ఉన్న కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయే దశకు చేరింది. కల్వర్టు నీటి ప్రవాహానికి కూలిపోతే పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

గుండారం రిజర్వాయర్ నుంచి సాగునీరు సరఫరా చేసే ఆర్‌ఎస్‌బీ కాలువలోని పూడిక, చెట్ల తొలగింపు, మరమ్మతు పనులు చేపట్టడానికి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే వేసవిలో పనులు చేపడుతాం.

– రాజేందర్, ఇరిగేషన్ డీఈ

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



పనులు ప్రారంభిస్తున్న ఎస్‌ఈ మాధవరావు

రామగిరి: ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమని జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈ మాధవరావు అన్నారు. మండలంలోని రాజాపూర్‌లో 51 విద్యుత్ స్తంభాలకు రూ.5.6లక్షలు, లద్నాపూర్‌లో 55 విద్యుత్ స్తంభాలకు రూ.6.3లక్షల నిధులు మంజూరయ్యాయి. కాగా గురువారం ఆయా గ్రామాల్లో పనులు ఎస్‌ఈ ప్రారంభించారు. డీఈ ప్రభాకర్, లైన్‌మెన్ వడ్లకొండ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలను నీరుగార్చుతున్నారు



మంథని: వినతిపత్రం ఇస్తున్న పుట్ట మధు



సుల్తానాబాద్: వినతిపత్రం ఇస్తున్న రవీందర్‌సింగ్

మంథని: మహాత్మాగాంధీ ఆశయాలను రేవంత్‌రెడ్డి సర్కార్ నీరుగార్చుతున్నారని, అధికారం కోసం ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీలిచ్చి అమలు చేయడంలో విఫలమయ్యారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. రేవంత్ సర్కార్‌కు కళ్లు తెరిపించాలని కోరుతూ గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి, వినతిపత్రం సమర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, నాయకులు తరగం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, కనవేన శ్రీనివాస్, పుప్పాల తిరుపతి, పెగడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేదాకా పోరాటం ఆగదు

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా పోరాటం ఆగదని సివిల్ సప్లై మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి గురువారం బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, ఏఎంసీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్, సీనియర్ నాయకులు సూర శ్యామ్, తిప్పారపు దయాకర్, గొట్టం మహేశ్, రాజు, గోపి, తిరుపతి, సాజిద్, బాపూరావు, వహీద్, శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఉద్యోగుల సమస్య పరిష్కారానికి హామీ



వినతిపత్రం అందిస్తున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ఎన్టీపీసీ ఎన్బీసీ (నేషనల్ బైపార్టికేట్ కమిటీ)లో యాజమాన్యం హామీ ఇచ్చినట్లు ఎన్టీపీసీ ఎన్బీసీ సభ్యుడు, ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా తెలిపారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఎన్బీసీ 166వ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో చర్చించిన అంశాలపై ఆయన ఫోన్‌లో వివరించారు. యాజమాన్యం పలు డిమాండ్లపై సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. అనంతరం ఎన్టీపీసీ హెచ్‌ఆర్ డైరెక్టర్ అనిల్‌కుమార్ జాడ్లికి వినతిపత్రాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, రామగుండం ఎన్టీపీసీ హెచ్‌ఆర్ ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ కె.సంతోష్‌రెడ్డి

రామగుండం: రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా హెచ్‌పీసీఎల్ ట్యాంకర్ డ్రైవర్స్‌కు గురువారం రామగుండం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.సంతోష్‌రెడ్డి ఇంధన డిపో ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డిపోలో రోడ్డు భద్రతపై వివిధ అంశాలతో ప్రొజెక్టర్‌లో ప్రదర్శన రూపంలో అవగాహన కల్పించారు. సదస్సు తర్వాత ఉత్తమ డ్రైవర్లకు హెల్మెట్, షూస్ బహూకరించారు. అనంతరం డ్రైవర్లతో ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిజ్ఞ చేయించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కమాన్‌పూర్: మండల కేంద్రంలో ట్రాఫిక్ నియమ నిబంధనలపై గురువారం కమాన్‌పూర్ ఎస్సై కొట్టె ప్రసాద్ అవగాహన కల్పించారు. రామగిరి మండలంలోని కల్వచర్ల కృష్ణవేణి టాలెంట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు వివిధ వేషధారణలో వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఎస్సై–2 రవళి, పాఠశాల కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి, హెచ్‌ఎం బర్ల శ్రీనివాస్, అనిల్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

రామగిరి: రహదారి భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాలను నియంత్రించాలని ఎస్సై పెట్టం చంద్రకుమార్ సూచించారు. మండలంలోని నాగెపల్లి క్రాస్ రోడ్ వద్ద కల్వచర్ల కృష్ణవేణి పాఠశాల విద్యార్థులతో గురువారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థి వేసిన యమధర్మరాజు వేషధారణ ఆకట్టుకుంది. కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బర్ల శ్రీనివాస్, డైరెక్టర్లు రంజిత్‌రెడ్డి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ప్రజాభిప్రాయ సేకరణకు నిరసనగా అఖిలపక్ష కమిటీ

గోదావరిఖని: స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్‌హాల్లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్టీపీసీ ప్రజాభిప్రాయ సేకరణకు నిరసనగా అఖిల పక్ష కమిటీ ఏర్పాటు చేశారు. ఎన్టీపీసీ ప్రజాభిప్రాయ సేకరణకు నిరసనగా అఖిలపక్ష కమిటీ(జేఏసీ)లో బీఆర్‌ఎస్ నుంచి కోరుకంటి చందర్, బీజేపీ నుంచి బల్మూరి అమరేందర్‌రావు, న్యూడెమాక్రసీ నుంచి ఇ.నరేశ్, బీఎస్పీ నుంచి ఇరికిల్ల శంకరయ్య, టీడీపీ నుంచి దామెదర్‌రెడ్డి, న్యూ ఇండియా పార్టీ నుంచి జేవీరాజు, మాస్ లైన్ పార్టీ నుంచి జూపాక శ్రీనివాస్, తోకల రమేశ్ ఉన్నారు. పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులు ఉమామహేశ్వర్‌రావు, మేకల శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు నారాయణదాసు మారుతి బుర్ర శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

• జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు, టౌన్‌షిప్ ఏరియాలో విధులు నిర్వహిస్తున్న గ్రాస్ కటింగ్, సివిల్ విభాగాల కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, బ్రాంచి కార్యదర్శి బుచ్చయ్య కోరారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు సీజీఎం కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

• ఎంపీడీవో అంత్యక్రియల్లో టీజీవో జిల్లా అధ్యక్షుడు

రామగుండం: అంతర్గాం మండల పరిషత్ అధికారి మహ్మద్ అబ్దుల్ అలీం బుధవారం గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఆయన అంత్యక్రియల్లో అంతర్గాం తహసీల్దార్, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తూమ్ రవీందర్‌పటేల్ పాల్గొన్నారు. అంత్యక్రియల్లో మండల పరిషత్ సూపరింటెండెంట్ మామిడాల కరుణాకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడ్డి తిరుపతిగౌడ్, ఏపీఎం రమేశ్, అంతర్గాం మండలంలోని వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

• అవగాహనతోనే టీబీ నిర్మూలన

కోల్‌సిటీ: అవగాహనతేనే టీబీ నిర్మూలన సాధ్యమని గోదావరిఖని అడ్డగుంటపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మణికేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక 49వ డివిజన్‌లో టీబీ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. టీబీ నిర్మూలనకు 100రోజుల నిక్షయ శివర్ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మార్చి 24వ వరకు కొనసాగుతుందన్నారు. జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్, ఎస్‌టీఎస్ కౌన్సిలర్ గోపికృష్ణ, శ్రావణి, సీవో అనిత, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, సిబ్బంది మల్లమ్మ, పద్మ, రాజేశ్వరి, షబానా, మణమ్మ పాల్గొన్నారు.

• ప్రభుత్వ వైద్యసేవలు వినియోగించుకోవాలి

జూలపల్లి: కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని, ప్రతీఒక్కరు వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ప్రభుత్వ వైద్యసేవలను వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్పర్ష్ పక్షోత్సవాల్లో భాగంగా, కుష్టుపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట, ఎలిగేడు, నర్సాపూర్, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా ఆధ్వర్యంలో కుష్టుపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు.

సుల్తానాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్లు రుక్మిణి, ఉదయ్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్ పాల్గొన్నారు.

• బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

గోదావరిఖని: గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలకు కేంద్ర హోంమంత్రి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని మాల సాంస్కృతిక శాఖ జిల్లా అధ్యక్షుడు బొమ్మక వెంకటేశ్వర్లు, కడమండ శ్రీహరి డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.


• మా భూములను కాపాడాలి

గోదావరిఖని: తాము కష్టార్జితంతో కొనుగోలు చేసిన భూములపై సమాజంలో పలుకుబడి ఉన్న వ్యక్తులు కన్నేశారని సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ మాజీ ఉద్యోగులు వాపోయారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ విషయంలో కోర్టుకు కూడా వెళ్లామని, కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. తీర్పు తమకు అనుకూలంగా ఉన్నా సదరు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టకుండా తమను అడ్డుకుంటున్నారని వాపోయారు. బాధితులు సాంబమూర్తి, సమ్మయ్య, హనుమంత్‌రావు, జీవన్‌రావు, సదానందం, రమేశ్ బాబు, విజయ్ పాల్గొన్నారు.

• ఎంపీటీసీ ఎన్నికల డ్రాఫ్ట్ విడుదల

రామగిరి: మండలంలోని 13 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన జాబితాను గురువారం ఎంపీడీవో శైలజారాణి విడుదల చేశారు. ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే తెలిపాలని కోరారు.

‘ఖని’లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన



కాంగ్రెస్ శ్రేణులతో మంత్రి పొన్నం ప్రభాకర్

గోదావరిఖని: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ గురువారం గోదావరిఖనిలో పర్యటించారు. అనారోగ్యం బారిన పడి కోలుకున్న కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బొంతల రాజేశ్, పితృవియోగం పొందిన కాంగ్రెస్ నేత కోట రవిని మంత్రి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కోల్‌బెల్ట్ ప్రాంతానికి వచ్చిన మంత్రికి కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. స్థానిక నాయకులు దీటి బాలరాజు, మహంకాళిస్వామి, కాల్వ లింగస్వామి, సన్నీ, తిప్పారపు శ్రీనివాస్, చెర్కు బుచ్చిరెడ్డి, రమేశ్, గుంపుల ఓదెలు ఉన్నారు.



గోదావరిఖని: పూలమాల వేస్తున్న నాయకులు



పెద్దపల్లిరూరల్: నివాళి అర్పిస్తున్న నాయకులు



కోల్‌సిటీ: పూలమాల వేస్తున్న అధికారులు



సుల్తానాబాద్‌లో..

మహాత్ముడికి నివాళి

గోదావరిఖని/పెద్దపల్లిరూరల్/యైటింక్లయిన్‌కాలనీ/కోల్‌సిటీ/సుల్తానాబాద్/గోదావరిఖనిటౌన్: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.

రైతుల రుణమాఫీ సమస్యలు పరిష్కరించండి

రామగిరి: మండలంలోని సెంటినరికాలనీ కేడీసీసీ బ్యాంక్‌లోని సుమారు 24 మంది రైతుల రుణమాఫీ సమస్య పరిష్కరించాలని గురువారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి వినతిపత్రం అందజేశారు. సెంటినరికాలనీలోని శ్రీపాదభవన్‌లో మంత్రి శ్రీధర్‌బాబును రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి రుణమాఫీ సమస్యలను ప్రిన్సిపాల్ సెక్రటరీ రఘునందన్ రావుకు తెలిపి సమస్య త్వరితగతిన పూర్తి చేసి రుణమాఫీ చేయాలని ఆదేశించారు.

ఆర్‌అండ్‌ఆర్ పరిహారం సమస్య పరిష్కరించాలి

రామగిరి: మండలంలోని లద్నాపూర్ గ్రామస్తులకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం సమస్య పరిష్కరించాలని గురువారం మంత్రి శ్రీధర్‌బాబును గ్రామస్తులు హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. ఆర్‌అండ్‌ఆర్ పరిహారం విషయంపై అధికారులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు శ్రీనివాస్, లింగయ్య, చంద్రయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, జమీల్, ప్రకాశ్, ప్రశాంత్, శ్రీకాంత్ ఉన్నారు.

సింగరేణి వార్తలు

ఘనంగా అమరవీరుల సంస్మరణ దినం



నివాళి అర్పిస్తున్న జీఎం కార్యాలయ సిబ్బంది



నివాళి అర్పిస్తున్న అధికారులు

గోదావరిఖని: అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశానుసారం స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు త్యాగం చేసిన వారి జ్ఞాపకార్థం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి స్మారకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి సాయిప్రసాద్, బ్రాంచ్ సెక్రటరీ అరెల్లి పోషం, సీఎంవోఏఐ ఇన్‌చార్జి క్రాంతి, జీఎం ఆఫీస్ ఇన్‌చార్జి రాజు, ఏరియా ఇంజినీర్ దాసరి వెంకటేశ్వర్‌రావు, ఎన్విరాన్‌మెంట్ డీజీఎం ఆంజనేయప్రసాద్, సీనియర్ పీవో బంగారు సారంగపాణి శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, బీమా, వసంత్‌కుమార్, వీరారెడ్డి, ఉమేశ్, అక్బర్ అలీ పాల్గొన్నారు.

ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో..

అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆర్జీ–2 ఏరియాలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎస్‌వోటూ జీఎం రాముడు, సెక్రటరీ శ్యాంసన్, అధికారులు ధనుంజయ, మురళీకృష్ణ, బుక్య దేశాయి, వెంకటరామచంద్ర, సునీత, సుభాష్, పండరీనాథ్, వేణుగోపాల్, వంశీధర్ పాల్గొన్నారు.

ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలలో..

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలలో గురువారం అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. జీఎం కార్యాలయంలో ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్ రావు, ఉద్యోగులు, అధికారులు హాజరై గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు సంతోష్, కోట రవీందర్‌రెడ్డి, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, వివిధ విభాగాల అధిపతులు చంద్రశేఖర్, రాజారెడ్డి, రాజేంద్రకుమార్, నాగేశ్వరరావు, సుధాకర్, ఐలయ్య, గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.

ఆర్జీ–1 ఏరియాలో డైరెక్టర్ పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్

గోదావరిఖని: సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ సత్యనారాయరావు గురువారం ఆర్జీ–1 ఏరియాలో పర్యటించారు. ఏరియాలోని జీడీకే–5 ఓసీపీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు క్వారీలోకి వెళ్లి రక్షణ చర్యలను పరిశీలించారు. డైరెక్టర్ వెంట ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఇతర అధికారులు ఉన్నారు.

క్యాంటీన్ మూసివేసిన క్లర్క్‌పై చర్యలు తీసుకోవాలి



మూసివేసిన క్యాంటీన్ వద్ద కార్మిక నాయకులు

గోదావరిఖని: క్యాంటీన్లను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాలని యాజమాన్యం నిర్ణయం తీసుకుంటే ఇక్కడి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కార్మికులు సంస్థ సీఅండ్‌ఎండీ బలరాంకు ఫిర్యాదు చేశారు. కార్మికుల సంతకాలతో కూడిన ఫిర్యాదు పంపించారు. క్యాంటీన్ మూసివేయడం మూలంగా కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే భోజనం సమయంలో కూడా మూసివేసి ఉండడంతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఈ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని వారు కోరారు.

మెడికల్ కార్డుల దరఖాస్తుకు గడువు పెంపు

గోదావరిఖని: సింగరేణి సంస్థలో వివిధ కారణాలతో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు వైద్య సేవలు పొందేందుకు ఏర్పాటు చేసినటు కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికేర్ స్కీం (సీపీఆర్ఎంఎస్) కింద సభ్యత్వం పొందేందుకు చివరి అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్జీ–2 జీఎం వెంకటయ్య తెలిపారు. ఇంత వరకు మెడికల్ కార్డు పొందని, రిటైర్డ్ అయిన అర్హత గల ఉద్యోగులు రూ.60వేలు చెల్లించి పథకంలో చేరవచ్చని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఏదైనా కారణాలతో దరఖాస్తు చేసుకోని అర్హత గల మాజీ ఉద్యోగులు మెడికల్ కార్డు పొందడానికి సింగరేణి యాజమాన్యం చివరి అవకాశం కల్పించిందన్నారు. ఈ ఏడాది మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్కీంలో సభ్యులుగా ఉన్నవారు లైఫ్ సర్టిఫికెట్ ఏటా నవంబర్‌లో ఆన్‌లైన్‌లో మీసేవ ద్వారా సమర్పించాలని సూచించారు. ఆర్జీ–2 ఏరియా విశ్రాంత ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.